పైప్ తగిలి మున్సిపల్ కార్మికుడు మృతి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పైప్ తగిలి మున్సిపల్ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. మాక్లూర్ మండలం బోర్గం (కె) గ్రామానికి చెందిన జేరిపోతుల అంజయ్య (48) అనే వ్యక్తి గత 15 సంవత్సరాలుగా మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అందులో భాగంగా రోజులాగే గురువారం ఉదయం పనికి వెళ్లాడు. గంగస్థలం ఫేజ్-2లోని అశోక ఎవెన్యూ ముందర అండర్ గ్రౌండ్ డ్రైనేజీని జెట్ మిషన్‌తో క్లీన్ చేస్తుండగా పైపు రివర్స్ వచ్చి అంజయ్య ఎడమ చెవి క్రింది భాగంలో తగిలింది. దీంతో బలమైన గాయమవడంతో అక్కడున్నవారు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. భార్య జేరిపోతుల రాజేశ్వరి ఫిర్యాదు మేరకు నిజామాబాద్ రూరల్ ఎస్సై మహేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు.

అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు

- కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ
- తాడ్వాయి పోలీస్‌స్టేషన్ సందర్శన



నవతెలంగాణ-తాడ్వాయి

ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ అన్నారు. గురువారం తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌ను ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఓటర్లకు కావలసిన పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇంతకు ముందు గొడవలు, వేర్వేరు నేరాలలో ఉన్న నేరస్థులను, ప్రజాశాంతికి ఇబ్బంది పెట్టే వాళ్ళను బైండోవర్ చేయాలని, అక్రమ మద్యం మొదలైన వాటిపై చర్యలు తీసుకోవాలని తాడ్వాయి ఎస్ఐ ఆంజనేయులు ఆదేశించారు.

కోతలు ప్రారంభమైనా..
కొనుగోలు కేంద్రాల్లేవ్..!

- సోయా, వరి పంట కోతలు షురూ..
- దళారులకు విక్రయిస్తున్న రైతులు
- ఇదే అదునుగా ధర తెగ్గోస్తున్న వ్యాపారులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలో పంటల కోతలు జోరందుకున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసిన సోయా, వరి పంటల కోతలు చేపడుతూ రైతులు బిజీగా మారారు. ఇదిలా ఉండగా.. కొనుగోలు కేంద్రాలను మాత్రం ప్రభుత్వం ప్రారంభించలేదు. దీంతో రైతులు చేసేదేమీలేక దళారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థులు జోరుగా ప్రచారం చేపడుతున్నారు. రైతుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ధాన్యం ఆరబెడుతున్న రైతు

బోధన్ నియోజకవర్గంలో వానాకాలంలో 85,496 ఎకరాల్లో వరి, 19,824 ఎకరాలలో సోయాను రైతులు సాగుచేశారు. బోధన్ మండలంలో వరి 34,222 ఎకరాలలో, సోయా 14,128 ఎకరాలలో, రెంజల్ మండలంలో 14,432 ఎకరాలలో వరి, 5,564 ఎకరాలలో సోయా, నవీపేట్ మండలంలో 24,084 ఎకరాలలో వరి, 105 ఎకరాలలో సోయా, ఎడపల్లి మండలంలో 12,521 ఎకరాలలో వరి, కేవలం 26 ఎకరాలలో సోయా పంట సాగు చేశారు. అయితే గత వారం, పది రోజుల నుంచి బోధన్ నియోజకవర్గంలో రైతులు సోయా, వరి ధాన్యం కోతలు ప్రారంభించారు. దాంతో చేతికొచ్చిన పంట నష్టం జరగకముందే రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఎదురు చూడలేక దళారులకు అమ్ముకుంటున్నారు. అలాగే దళారులు కూడా రైతుల పరిస్థితులను అదనుగా భావించి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తుందోననే ఆందోళనలో ఉన్నారు. పంట కోతల ప్రారంభంలో దళారులు ధాన్యానికి బాగానే గిట్టుబాటు ధర చెల్లించినా.. తర్వాత ధరను తగ్గించారు. దాంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. వరి కోతల ప్రారంభంలో దళారులు పచ్చి ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తూ క్వింటాకు రూ.2400 చెల్లించారు. దాంతో రైతులు చకచక కోతలు కొనసాగించారు. ప్రస్తుతం దసరా పండగ సమీపిస్తుండడంతో రైస్ మిల్లర్లు రైస్ మిల్లులలో పూజలకు సిద్ధం చేస్తుండడంతో ధాన్యం కొనుగోలు నిలిపివేశారు. దాంతో దళారులు ధరను రూ.2400 నుంచి 2000 లకు తగ్గించడంతో రైతులు క్వింటాకు రూ.400 నష్టపోవాల్సి వస్తుంది.



కుప్పగా పోసిన ధాన్యం

సోయాకు మద్దతు ధర తక్కువే..

వరి కోతలతో పాటు రైతులు ప్రస్తుతం సోయా కోతలు ప్రారంభించారు. వాతావరణ పరిస్థితులకు భయపడి రైతులు ముందస్తుగానే సోయా కోతలు చేపడుతున్నారు. సోయా కోతలు ప్రారంభించి వారం రోజులు అవుతున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దాంతో రైతులు దళారులకు ఆశ్రయించి క్వింటాకు రూ.4400లకే సోయా అమ్ముకుంటున్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా ఈ సంవత్సరం ఇంకా ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు.

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి..

సోయా పంట పండించడానికి ఎకరానికి రూ.30,000 పెట్టుబడి, కౌలు రూ.30,000 పెట్టుబడి పెట్టి మరీ రైతులు పంటను సాగుచేస్తున్నారు. సోయా పంటకు వైరస్ సోకడం వలన గింజ నిండుదనం లేక దిగుబడి తగ్గిందని రైతులు తెలిపారు. దాంతో పెట్టిన పెట్టుబడి కూడా సరిగా రాని పరిస్థితి ఉందని వాపోతున్నారు. అలాగే వరి పంటకు కౌలు రూ.30వేలు, పెట్టుబడి రూ.35వేలు పెట్టినామని రైతులు తెలిపారు. వరి పంట మొదటి పంటకు నష్టం వచ్చిన రెండవ సారి వేసిన పంటతో కొంత పెట్టుబడి మాత్రం మిగిలే అవకాశం ఉందని చెబుతున్నారు.

పెరిగిన ఎరువుల ధరలు.. పెరగని మద్దతు ధర..

ప్రస్తుతం మార్కెట్‌లో ఎరువుల ధరలు అధికంగా పెరగడం వలన పెట్టుబడులు భారంగా మారాయి. ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేయడంతో రైతులకు ఆర్థిక భారం తప్పడం లేదు. రైతుబంధు ఎకరానికి రూ.5000లు ప్రభుత్వం ఇస్తున్నా అవి దేనికీ సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. రైతుబంధుతో పాటు ఎరువుల ధరలు తగ్గించడం, సబ్సిడీలు అమలు చేసి మద్దతు ధర పెంచి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం సోయా అమ్మకాల వలన దళారులు మద్దతు ధర తక్కువ ఇవ్వడం వలన రైతులు నష్టపోతున్నారని కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి గతంలో కంటే ఈసారి మద్దతు ధర పెంచి ఇవ్వాలని రైతుల కోరుతున్నారు.

ప్రయివేటోళ్లకు అమ్ముకుంటున్నాం



తాను 2 ఎకరాలలో సోయా పంట ఏశిన. సోయా పంటకు రోగం రావడంతో దిగుబడి బాగా తగ్గింది. పోయినేడాది ఎకరానికి 11 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ సారి ఎకరానికి 7క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దాంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితులు లేక నష్టపోయినా. ప్రభుత్వ కాంట తొందరగా పెడితే బాగుంటుంది. ప్రయివేటోల్లు వచ్చి తక్కువ ధరకే సోయా కొంటున్నరు.

- కుమ్మన్‌పల్లి లాలయ్య, రైతు.

మరోసారి ప్రజల్ని మభ్యపెట్టేందుకు
పార్టీల ప్రయత్నం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మరొకసారి ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి రావాలని బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ తెలిపారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో నిజామాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, అధికారం కొరకు పాకులాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి మేనిఫెస్టోలో ఒకరికి మించి ఒకరు తాయిలాలను ప్రకటిస్తూ ఎట్లయినా సరే అధికారంలోకి రావాలని ప్రజలను వంచించి అధికారం కైవసం చేసుకోవాలని ఆలోచిస్తున్నారే తప్ప ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడం కోసం, ఈ అవకాశాల్ని పెంచటానికి తీసుకోవలసిన చర్యల గురించి, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయటానికి భూసంస్కరణలను అమలు జరపటానికి, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి, విద్య వైద్య రంగాలను ప్రజలకు చేరువ చేయడానికి ఎటువంటి చర్యలను చేపట్టకుండా మోసం చేయాలని ఆలోచిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగంలో ఉన్న ఈడీని, సీబీఐని, ఇన్కమ్ టాక్స్ సంస్థలను అడ్డుపెట్టుకొని సామ, గాన, భేద, దండోపాయాల ద్వారా తమకు అనుకూలంగా మార్చుకోవటానికి ప్రయత్నం చేయటంతో పాటు ప్రభుత్వ రంగాన్ని వ్యవసాయ రంగాన్ని సేవా రంగాలను ధ్వంసం చేసి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి అధికారం సంపాదించాలని ఆలోచిస్తున్నారని, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించ కుండా తిరిగి అధికారంలోకి వస్తే తామేదో తాయిలాలు ప్రకటిం చటం సరైంది కాదని న్యాయంగా ప్రజలకు ఉపయోగపడే రాజకీయా లను ప్రజలు ప్రోత్సహిం చాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రమేష్‌బాబు, కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంక ట్‌రాములు, పి.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు సూరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాస్కర్

మల్యాల గోవర్ధన్ రాజీనామా ఆమోదం..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఎం.గోవర్ధన్ చేసిన రాజీనామాను జిల్లా కమిటీ ఆమోదించిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు తెలిపారు. ఇకపైన పార్టీకి, గోవర్ధన్‌కు ఎటువంటి సంబంధం లేదని, ఆయన ఇకపైన పార్టీ పేరును గానీ, నాయకుల పేరుతో గానీ నిర్వహించే ఎటువంటి కార్యక్రమానికి పార్టీతో సంబంధం ఉండదని దీన్ని ప్రజలందరూ గ్రహించాలని సూచించారు.

రోడ్డు సరే..
ట్యాంక్ సంగతేంటి..?

- రోడ్డు పక్కనే ఉండటంతో ప్రమాదకరంగా మారిన వైనం
- తొలగించాలని కోరుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో హైవేపై ప్రభుత్వం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతోంది. అయితే అందులో భాగంగా హైవే పైనుంచి రాకపోకలను సంబంధిత అధికారులు నిషేధించనున్నారు. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకల కోసం హైవేకు ఇరువైపులా సర్వీస్ రోడ్డును నిర్మించారు. మండలంలోని పద్మాజివాడి గ్రామం వద్ద సైతం సర్వీస్ రోడ్డును నిర్మించినా.. ఆ రోడ్డుకు ఆనుకునే మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఉంది. రోడ్డు పక్కనే ఉండటంతో అది ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం నిజామాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్లే వాహనాలన్నీ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయ్యేవరకూ ఈ సర్వీస్ రోడ్డు గుండానే వెళ్లాలి. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డు గుండా వెళ్లాల్సి ఉంటుంది. అయితే రోడ్డు పక్కనే మిషన్ భగీరథ ట్యాంకు ఉండటంతో ప్రమాదకరంగా మారింది. సర్వీస్ రోడ్డు వద్ద స్వల్ప క్రాసింగ్ ఉండటం, రోడ్డు సైతం వెడల్పు తక్కువగా ఉండటంతో అతివేగంగా వచ్చిన వాహనాలు ట్యాంక్‌ను ఢీకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ ట్యాంక్‌ను తొలగించి మరో స్థలంలో నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ట్యాంక్ సమీపంలోనే ప్రాథమికోన్నత పాఠశాల, వాటర్ ప్లాంట్, చాకలి ఐలమ్మ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలు, బస్సు స్టాప్ ఉన్నాయని, అలాగే ఆ ట్యాంక్ పక్క నుంచి పద్మాజివాడి, కల్వరాల్ గ్రామస్తులు నిత్యం కాలినడకన వెళ్తుంటారు. అలాగే ద్విచక్ర వాహనదారులు ట్యాంకు పక్క నుంచే పద్మాజివాడి చౌరస్తాకు వెళ్తుంటారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే ప్రమాదకరంగా మారిన ట్యాంక్

సైనికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



సైనికుడి భార్యకు నగదు ఆర్థిక సహాయం చేస్తున్న స్పీకర్ పోచారం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గంగాప్రసాద్ సిక్కిం వరదల్లో అకాల మరణం చెందడంతో గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గ్రామ పెద్దలు బాధిత కుటుంబ సభ్యులను తీసుకుని బాన్సువాడలో కలిశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు జవాన్ కుటుంబ పరిస్థితులపై స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వివరించారు. జవాన్ కుటుంబానికి రావలసిన ప్రయోజనాలపై తాను కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వం తరుపున రావలసిన సహాయం కోసం కృషి చేస్తానని పోచారం హామీ ఇచ్చినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అలాగే జవాన్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, సోదరుడికి ఆయన తండ్రి పేరున ఉన్న వీఆర్ఏ ఉద్యోగం, రూ.50వేలు ఇప్పించేలా కలెక్టర్‌తో మాట్లాడతానని స్పీకర్ తెలిపారన్నారు. బాన్సువాడ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జవాన్ కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయం చేశారు.

నేడు అశోక విజయదశమి ఉత్సవాలు

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డిలో అశోక విజయ దశమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. మహనీయుల విగ్రహాల నుంచి దమ్మ పరివర్తన నడక ఉంటుందని, అనంతరం దేవునిపల్లిలోని మున్నూరు కాపు కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు సభ్యులందరూ తమ కుటుంబ సభ్యులతో తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

నవతెలంగాణ-రామారెడ్డి

పేకాటాడుతున్న నలుగురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారం గ్రామంలో పేకాటాడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు, పేకాట స్థావరంపై దాడి చేయగా, పేకాటాడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ.6950 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఏసీబీకి చిక్కిన డిప్యూటీ ఈఐఈ

- అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టిన అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్సర్మేషన్ ఇంజనీర్ ఏసీబీకి చిక్కారు. ఐఅండ్‌డీపీఆర్ శాఖలో పని చేసిన విశ్రాంత ఉద్యోగి లక్ష్మీనారాయణకు సంబంధించి రావాల్సిన బెనిఫిట్ కోసం లంచం డిమాండ్ చేసి అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. గురువారం నిజామాబాద్ నూతన కలెక్టరేట్‌లోని ఐఅండ్ పీఆర్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్సర్మేషన్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వేణి ప్రసన్న అనే అధికారిణి రూ.9వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఐఅండ్‌పీఆర్ శాఖలో డ్రైవర్‌గా పనిచేసిన వ్యక్తి చనిపోవడంతో అతని కుటుంబానికి రావాల్సిన గ్రాట్యూటీ జీపీఎఫ్, ఇతర అలవెన్స్‌ల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సంబంధిత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్సర్మేషన్ ఇంజనీర్ వేణి ప్రసన్న తొమ్మిది వేల లంచం ఇస్తే సంబంధిత నిధుల విడుదలకు ఓకే చేస్తానని చెప్పడంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. బాధిత కుటుంబం నుంచి తొమ్మిది వేలు తీసుకుంటుండగా నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలోని ఇన్‌స్పెక్టర్లు నగేష్, శ్రీనివాసులు ఈ దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటున్న వేణి ప్రసన్నను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

అన్ని అసెంబ్లీ స్థానాలను హస్తగతం చేసుకోవడం ఖాయం

- రాహుల్ గాంధీపై మాట్లాడే నైతిక విలువలు కవితకు లేవు
- మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాహుల్ గాంధీ పర్యటనతో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ హస్తగతం చేసుకోవడం ఖాయమని, రాహుల్ గాంధీపై మాట్లాడే నైతిక విలువలు కవితకు లేవని, రాహుల్ గాంధీ పై కవిత చేసిన వ్యాఖ్యలు అధికార అహంకారానికి నిదర్శనమని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు సిరుగుప్ప (కర్ణాటక) ఎమ్మెల్యే బీ.ఎం నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ విజయభేరి యాత్రలో భాగంగా జిల్లాకు వచ్చేస్తున్న సందర్భంగా జిల్లాలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాహుల్ గాంధీ విజయభేరి బస్సు యాత్రలో భాగంగా జిల్లాలోని కమ్మర్‌పల్లి నుంచి మోర్తాడ్ బస్ స్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించి, ఆ తర్వాత ఆర్మూర్ చేరుకొని కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. నిజామాబాద్ అర్బన్ ప్రాంతంలో కూడా ఆయన పర్యటించాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాలవల్ల నిజామాబాద్ నగర పర్యటన రద్దయిందని నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. కల్వకుంట్ల కవిత రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కవిత మాటలు అధికార దురహంకారానికి నిదర్శనమని అన్నారు. కల్వకుంట్ల కవిత తన స్థాయిని మించి మాట్లాడుతున్నారని, రాహుల్ గాంధీని పొలిటికల్ టూరిస్ట్ అనడం సిగ్గుచేటని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం మీ కుటుంబంలో ఎంత మంది జైలుకు వెళ్లారని ఎంతమంది ప్రాణాలర్పించారని ఆయన ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్‌గాంధీది అయితే తెలంగాణ ఉద్యమంతో దొంగదీక్ష చేసిన చరిత్ర మీ నాన్న కెసిఆర్‌ది అని దుయ్యబట్టారు. పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోపిడీ చేస్తున్న తీరును ఎండగట్టడంతో పాటు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా ఏ విధంగా అన్యాయం చేసిందో టిఆర్ఎస్, బిజెపి మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలకు వివరించేందుకు రాహుల్ గాంధీ విజయభేరి యాత్రతో తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు, రూరల్ ఇన్చార్జి భూపతిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

తనిఖీల్లో నగదు స్వాధీనం

నవతెలంగాణ-బోధన్/భిక్కనూర్

బోధన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం మధ్యాహ్నం తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి వద్ద రూ.4,00,000 నగదును పట్టుకున్నట్టు పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన విశ్రామ్ హారాజీభాను శాలీ అనే వ్యక్తి వద్ద తనిఖీలో ఈ నగదు లభించిందని సీఐ తెలిపారు. ఈ డబ్బులు గన్నీ బ్యాగులు కొనుగోలు చేసిన దానికి సంబంధించినవని ఆ వ్యక్తి తెలిపినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ డబ్బులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాటిని పంచనామా నిర్వహించి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

భిక్కనూర్ : మండలంలోని టోల్ గేట్ వద్ద వాహన తనిఖీలలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న రెండు కార్లలో రూ.1,82,500, మరో కారులో రూ.60 వేలు లభించాయి. ఎలాంటి పత్రాలు లేని కారణంగా నగదును స్వాధీనం చేసుకొని ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు అప్పగించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

అక్రమ మద్యం పట్టివేత

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలకేంద్రంలో ఎస్ఐ కోనారెడ్డి ఆధ్వర్యంలోవాహనాలు తనిఖీచేస్తున్న సందర్భంగా మండల కేంద్రం నుండి అక్రమంగా మద్యం తీసుకెళ్తున్న తలబ్ తండాకు చెందిన లాల్ సింగ్‌అనేవ్యక్తి మద్యం సీసాలు పట్టుకున్నారు. 21సీసాలను స్వాధీనం చేసుకొని పట్టుకున్న వ్యక్తిపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నవతెలంగాణ
నిజామాబాద్
శుక్రవారం | అక్టోబర్ 20, 2023 | www.navatelangana.com

గ్రామాభివృద్ధి కమిటీపై చర్యలు తీసుకోవాలి

● ఆబ్కారీ శాఖ సీఐకి వినతి

నవతెలంగాణ-ముప్కాల్

తమ సమస్యలను పరిష్కరించాలని మండలకేంద్రానికి చెందిన గీతపారిశ్రామిక సంఘం సభ్యులు గురువారం ఆబ్కారీ శాఖ కార్యాలయంలో సీఐ స్టీఫెన్‌కు వినతిపత్రం అందజేశారు. గీత వృత్తిపై ఆధారపడిన తమపై గ్రామాభివృద్ధి వారు కమిటీ ఆటంకాలు సృష్టిస్తూ, గ్రామంలో కల్లు అమ్మకాలు జరుగకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తికి అడ్డుగా వస్తున్న గ్రామాభివృద్ధి కమిటీపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముప్కాల్ కల్లు గీతపారిశ్రామిక సంఘం సభ్యులు దిలీప్ గౌడ్, కృష్ణ గౌడ్, కల్లు స్వామి, లింగాల రాజ్ గౌడ్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గీతపారిశ్రామిక సంఘం సభ్యులు

పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ సిబ్బందికి గురువారం దుస్తులను పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సక్కారం అశోక్ పంచాయతీ సిబ్బందికి దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా గ్రామ పంచాయతీ నిధుల నుండి సిబ్బందికి కానుకగా నూతన వస్త్రాలు అందించినట్లు తెలిపారు. పదిమంది పంచాయతీ సిబ్బందికి రెండు జతల చొప్పున దుస్తులను అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, వార్డు సభ్యులు గణేష్, సాగర్, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకానీ మహేష్, నాయకులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

సెల్‌ఫోన్లు రికవరీ



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ విజయ్ బాబు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ విజయ్ బాబు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నాలుగు సెల్ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. సిఈఐ ఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. నలుగురు బాధితులకు ఫోన్లను అప్పగించామన్నారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

మంత్రిని పరామర్శించిన పిఆర్‌టియు నాయకులు



మంత్రి ప్రశాంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మంత్రివర్యులు వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి మరణించిన సందర్భంగా గురువారం పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, మిర్జాపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంట శ్రీనివాస్ రెడ్డి వారి స్వగృహంలో పరామర్శించారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎలక్షన్ కోడ్ పాటించాలి

తహసీల్దార్ కలీం



మాట్లాడుతున్న తహసీల్దార్ కలీం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో ఎలక్షన్ కోడ్ పాటించాలని తహసీల్దార్ కలీం గురువారం అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో వివిధ పార్టీల బ్యానర్లను తొలగించాలని, గ్రామంలోని ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేట్ స్థలాల్లో రాజకీయ పార్టీల ప్రచారాన్ని తుడిచి వేయాలని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ నవీన్, బీఎల్వోలు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు బైండోవర్



పలువురు నాయకులను బైండోవర్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పలు గ్రామాలలో రాజకీయ నాయకులను పోలీసులు తహసీల్దార్ ముందు ముందస్తు బైండోవర్ చేశారు. గత ఎలక్షన్లో ఎన్నికల కోడ్ అతిక్రమించిన వారిని తహసీల్దార్ ముందు పోలీసులు బైండోవర్ చేశారు. మళ్లీ ఆరు నెలల వరకు తిరిగి ఎటువంటి తప్పులు చేయొద్దని ఎలక్షన్ కోడ్ విస్మరించరాదని తెలిపారు. ఎలక్షన్ కోడ్‌ను విస్మరిస్తే రెండు లక్షల జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మెండోర

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోచంపాడ్ వద్ద గల అంతర్ జిల్లా పోలీస్ చెక్ పోస్ట్‌ని ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్ గురువారం సందర్శించారు. చెక్ పోస్ట్ సిబ్బందికి సూచనలు ఇస్తూ వాహనాల తనిఖీ లు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధన ప్రకారం రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు తీసుకెళ్తే సరైన పత్రాలు చూపాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అక్రమ మద్యం కానీ డబ్బు కానీ తరలించకుండా సీఐలు, ఎస్సైలు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఏసీపీ వెంట ఆర్మూర్ రూరల్ సిఐ గోవర్ధన్ రెడ్డి , మెండోర , బాల్కొండ ఎస్సైలు శ్రీనివాస్ యాదవ్ , గోపీ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో నగదు లావాదేవీలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

● బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సాధారణ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బ్యాంకర్లకు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బ్యాంకర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రూ. పది లక్షలు, అంతకంటే పెద్ద మొత్తంలో నగదు డిపాజిట్, విత్ డ్రా జరిపే వారి వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉన్నందున, అలాంటి లావాదేవీలను గమనిస్తూ రోజువారీగా వివరాలు సమర్పించాలని అన్నారు. అసాధారణ, అనుమానాస్పద లావాదేవీలను సైతం గుర్తించాలని సూచించారు. అదే సమయంలో వ్యవసాయ పనులు, వ్యాపార అవసరాలకు నగదు లావాదేవీలు జరిపే వారికి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు జరుగుతున్నందున బ్యాంకుకు సంబంధించిన నగదు తరలిస్తున్న సమయంలో అన్ని నిబంధనలను పక్కాగా పాటిస్తూ, పూర్తి ఆధారాలు కలిగి ఉండాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ. 40 లక్షలకు మించకూడదని అన్నారు. అభ్యర్థులు ఒకే బ్యాంకు ఖాతా ద్వారా లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బ్యాంకు ఖాతా కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సత్వరమే చెక్ బుక్కు, ఏటీఎం డెబిట్ కార్డు వంటి వాటిని సమకూర్చాలని తెలిపారు. అభ్యర్థుల నుండి ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం ఉండకుండా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రీనివాస్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటం.. ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు

● బోధన్‌లో బతుకమ్మ ఆడి బోడ్యాలు బాయి మృతి
● ఆర్మూర్‌లో సంఘ ప్రారంభోత్సవానికి వెళ్లి గంగోని లక్ష్మీబాయి మృతి
● భారీ జనాల తాకిడి, డిజె సౌండ్ ఒత్తిడిలతో మృత్యువాత
● ఎన్నికల సంఘం నియంత్రించాలంటూ వేడుకోలు

నవతెలంగాణ-నవీపేట్

అసెంబ్లీ ఎన్నికల నగర మోగడంతో అన్ని రాజకీయ పార్టీలు బల ప్రదర్శన, ఆడంబరత, ఆకర్షణల కోసం అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. బోధన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబరాల సందర్భంగా నవీపేట్ మండలంలోని అబ్బాపూర్ తాండకు చెందిన గిరిజన మహిళ ఖోలా బోడ్యాలు బాయి(60) అకస్మాత్తుగా రోడ్డుపై పడిపోయింది. గమనించిన వెంటనే స్థానికులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సమాచారం మేరకు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేసే సమయంలోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే ఆర్మూర్ నియోజకవర్గంలో ఓ సంఘ కళ్యాణ మండపంలో కార్యక్రమం సందర్భంగా నవీపేట్ మండల కేంద్రానికి చెందిన గంగోని లక్ష్మీబాయి బుధవారం కార్యక్రమానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి రాత్రి నిద్ర పోగా వేకువ జామునే అకస్మాత్తుగా మృతి చెందింది. రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో జనాల తాకిడి, డిజె సౌండ్‌ల ఒత్తిడిలతోనే హఠాత్తుగా మృతి చెందుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకుల పదవుల దాహానికి అమాయక ప్రజలకు ఆశలు కల్పించి జన సమీకరణ కోసం తీసుకెళ్తూ ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని వాపోతున్నారు. ఇటువంటి ఘటనలు జరిగితే కప్పిపుచ్చుకునేందుకు సైతం పార్టీల నాయకులు ఆ కుటుంబాలకు కాసుల ఆశలు చూపి తప్పించుకుంటున్నారు. కరోనా తర్వాత డిజె సౌండ్స్ ఒత్తిడితో వృద్ధులే కాకుండా యువకులు, పిల్లలు సైతం గుండెపోటులతో హఠాత్తుగా మరణిస్తున్నారు. కాబట్టి రానున్న ఎన్నికల సందర్భంగా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్నికల సంఘం నియంత్రణ విధించాలని పలువురు మేధావులు కోరుతున్నారు.



మృతిచెందిన బోడ్యాలు బాయి, (ఫైల్‌ఫొటో)

మరోసారి దీవించండి.. మరింత అభివృద్ధి చేస్తా..

● యాదవ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

మరోసారి దీవించండి..మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. గురువారం వినాయక మున్నూరుకాపు సంఘంలో యాదవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ..గొల్ల కురుమలు ఆర్థికంగా వృద్ధి సాధించాలని సబ్సిడీ గొర్రెల పంపిణీకి కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. గొల్ల కురుమల సంక్షేమమే లక్ష్యంగా అత్యంగా పారదర్శకంగా గొర్రెపిల్లలు పంపిణీ చేశామన్నారు. యాదవుల ఆత్మ గౌరవానికి ప్రతికగా 25 లక్షల రూలతో యాదవ భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. పింఛన్లు రావలన్నా కళ్యాణ లక్ష్మీ రావాలన్న అభివృద్ధి కావాలన్నా మరోసారి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, కార్పొరేటర్లు మల్లేష్ యాదవ్, ఆకుల హేమలత, మహిళ నాయకులు మేక లక్ష్మీ యాదవ్, మంజుల యాదవ్, నానీ యాదవ్, యాదవ సంఘం నాయకులు గుర్రం మల్లేష్ యాదవ్, కుంభలా యాదగిరి యాదవ్, రఘు యాదవ్,దేవేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ సైనిక దాడిని ఆపాలి

● ఆర్మూర్‌లో భారీ ప్రదర్శన

నవతెలంగాణ-ఆర్మూర్

గాజాపై ఇజ్రాయిల్ దుర్మార్గపు సైనిక దాడిని ఆపి ఐక్యరాజ్య సమితి తీర్మానం ప్రకారం ఇజ్రాయిల్ వెంటనే వైదొలగాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ బాధితులైన పాలస్తీనా ప్రజలకు మద్దతివ్వకుండా జీవించే హక్కును హరిస్తున్న ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం అండదండలతో, ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తూ, పాలస్తీనా ప్రజల ప్రాణాలు బలిగొంటున్న ఇజ్రాయిల్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మద్దతు ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పాలస్తీనా ప్రతిఘటన పోరాటానికి సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు పలుకుతుందని ఆయన తెలిపారు. హమాస్ ను టెర్రరిస్టు సంస్థగా ఇండియన్ కార్పొరేట్ మీడియా ప్రచారం చేస్తోందని అన్నారు. ప్రతిఘటన మా జన్మ హక్కు అని గత 70 సంవత్సరాల నుండి ఉద్యమిస్తున్న పాలస్తీనా ప్రజలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని దాసు తెలిపారు. ప్రజాస్వామిక హక్కుల కోసం, జీవించే హక్కుల కోసం, న్యూ డెమోక్రసీ పోరాడుతుందని దాసు అన్నారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బి సూర్య శివాజీ, డివిజన్ నాయకులు ఖాజా మొయినుద్దీన్, ఎస్ రవి, ప్రిన్స్, వెంకటేష్, సొప్పరి గంగాధర్, చిట్టక్క, బుజ్జి, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

చాకిర్యాల్‌లో ఘనంగా అమరవీరుల దినోత్సవం



అమరవీరునికి నివాళ్లు అర్పిస్తున్న ఏసీపీ, కుటుంబీకులు

నవతెలంగాణ-మెండోర

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్ గురువారం చాకిర్యాల్ గ్రామానికి చెందిన పోలీసు అమరవీరుడు కానిస్టేబుల్ ఒడ్నాల నర్సయ్య స్వగృహంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో నక్షలైట్ల మందుపాతర బ్లాస్టింగ్‌లో నర్సయ్య అమరుడు అయ్యాడని అన్నారు. కుటుంబానికి అన్నివేళలా బాసటగా ఉండి పోలీసు శాఖ తరపున సహాయ సహకారాలు అందిస్తామని ఏసిపి తెలిపారు. పోలీసులుగా బాధ్యత నిర్వర్తించడానికి ముందుకు రాబోతున్న వారికి విధి నిర్వహణలో నూతనోత్తేజాన్ని, స్ఫూర్తిని నింపడమే పోలీసు అమర వీరుల సంస్మరణ దినం జరుపుకోవడంలోని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి , మెండోర ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ , బాల్కొండ ఎస్సై గోపి, నర్సయ్య తండ్రి గంగాధర్ , సోదరుడు మహేందర్ కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ విజయభేరి యాత్రకు తరలిరావాలి

● ముప్పగంగారెడ్డి

నవతెలంగాణ-మోపాల్/ముప్కాల్/కమ్మర్‌పల్లి



రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చేపట్టిన విజయభేరి యాత్ర కు మండలంలోని కార్యకర్తలు అందరూ తరలిరావాలని కిసాన్‌ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి అన్నారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఆర్మూర్‌లో విజయభేరి యాత్ర ఉంటుందని తెలిపారు. ఇంకో రెండు నెలల్లో మన ప్రభుత్వం, రైతుల ప్రభుత్వం, కర్షక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో అన్ని స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో విజయ బేరి యాత్ర సందర్భంగా చాలా రోజుల తర్వాత జిల్లాకి రాహుల్ గాంధీ వస్తున్నారన్నారు. వారికి అడుగడుగునా మనమందరం అండగా నిలవాలని అలాగే మనతోపాటు కార్యకర్తలే కాకుండా ప్రజలందరినీ కూడా తీసుకొచ్చి రూరల్ నియోజకవర్గం మీకు కానుకగా ఇస్తామని అన్నారు. ఎలక్షన్ కంటే ముందే ప్రజాబలం చూసి ఈ యోజకవర్గంలో కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందని ఆయనకు నమ్మకం కలుగుతుందని అన్నారు. మళ్లీ 2004లో జరిగిన ఎన్నికలను పునరావృతం చేసి తీరాలని తెలిపారు. అన్నిస్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ కోశాధికారి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని స్థానాల్లో కచ్చితంగా గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి బస్సు యాత్రను విజయవంతం చేయండి

ముప్కాల్: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన విజయభేరి బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండలం కేంద్రం బస్టాండ్ ప్రాంతంలో జరిగే కార్నర్ మీటింగ్ కు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి ముత్యాల సునీల్ రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు హాజరౌతున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, యువత అన్ని వర్గాల ప్రజలు సకాలంలో హాజరై ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యంరెడ్డి, డీసీసీ డెలిగేట్ కార్యదర్శి జెడి చంద రవి రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన విజయభేరి యాత్ర లో భాగంగా శుక్రవారం మోర్తాడ్ మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలు, బాల్కొండ నియోజక వర్గ ప్రజలు విజయవంతం చేయాలని టీపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏఐసిసి మాజీ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి బాల్కొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్, రాష్ట్ర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని టీపీసీసీ తరపున పిలుపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

బస్సు వేళల బోర్డులు ఏర్పాటు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్‌లో గ్రామపంచాయతీ సమీపంలో ఆర్టీసీ బస్సు వేళల బోర్డులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం, ఆర్టీసీ అధికారుల సూచనలు మేరకు గ్రామంలో ఈ బస్సు వేళల బోర్డులను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ సక్కారం అశోక్ తెలిపారు. గ్రామం మీదుగా భీంగల్ వెళ్లేందుకు, అదేవిధంగా గ్రామం మీదుగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వెళ్లేందుకు వీలుగా బస్సులు వచ్చే సమయాన్ని చూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సు సమయ బోర్డులను ఏర్పాటు చేయడం వల్ల గ్రామం నుండి ప్రయాణం సాగించే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. బస్సుల కోసం గంటల తరబడి బస్టాండ్ లో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, సమయం ప్రకారం బస్టాండ్‌కు చేరుకుంటే బస్సు ప్రయాణాలు సాగించేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బోర్డును ఏర్పాటుచేస్తున్న గ్రామపంచాయతీవారు

సార్ మిమ్మల్నే గెలిపిస్తాం

- కమ్మ సంఘం సభ్యుల తీర్మానం

నవతెలంగాణ-వర్ని

'సార్ మా కులస్తులందరం మీకే స్వచ్ఛందగా ఓటు వేసి గెలిపిస్తాం' అని కమ్మ సంఘాల సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి తీర్మానపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా.. బాన్సువాడ నియోజకవర్గంలో ఉన్న కుల సంఘాల, పలు వర్గాల ప్రజలు ఇప్పటికే పూర్తిస్థాయిలో తమ ఓటు మీకే అంటూ తీర్మానం పత్రాలు స్పీకర్‌కు అందజేశారు. దీంతో ఆయన గెలుపు ఖాయమేనని బీఆర్ఎస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



స్పీకర్‌ను సన్మానిస్తున్న కమ్మ సంఘం సభ్యులు

అన్నదానం

నవతెలంగాణ-మద్నూర్

దుర్గామాత నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీచౌక్ సమీపంలో గల పాపమ్మ ఆలయం వద్ద నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాపమ్మ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాల కాలంగా గల్లీ వాసులమంతా ఆలయాన్ని అభివృద్ధి పరుస్తూ ప్రతి సంవత్సరం దుర్గామాత నవరాత్రులలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

చిత్తు చిత్తుల బొమ్మ

"చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన" అంటూ మహిళలు ఆడిపాడారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలంతా బతుకమ్మను పేర్చి.. ఒక చోటకు చేరి పాటలు పాడుతూ నృత్యాలు చేయడం ఆకట్టుకుంది.

- ఘనంగా బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

రెంజల్: మండలంలోని కళ్యాపూర్, దూపల్లి, మౌలాలి తాండ, బోర్గం గ్రామాలలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళ్యాపూర్ గ్రామంలో సర్పంచ్ కాశం నిరంజనీ సాయిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు గాండ్ల నాగరాజ్, కిన్నెర మోహన్, ప్రధాన కార్యదర్శిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దూపల్లి గ్రామంలో సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, శేషుగారి భూమారెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని పెద్ద ఎత్తున నిర్వహించే ఈ బతుకమ్మ వేడుకలను గ్రామస్తులందరూ వీక్షించడం విశేషం. బోర్గం గ్రామంలో సర్పంచ్ పార్థవాని సాయిరెడ్డి, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మౌలాలి తండా సర్పంచ్ జాదవ్ సునీత బాబు నాయక్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు జరిగాయి. గత రెండు మూడు రోజులుగా వివిధ రకాల పూలను సేకరించి మహిళలు అత్యంత తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా బతుకమ్మలను తయారు చేశారు. పోటీ పడుతూ మహిళలు బతుకమ్మలను తయారు చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంబరాలు..

తాడ్వాయి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థినిలు పువ్వులతో బతుకమ్మలు పేర్చి ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ వేడుకలలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్‌తో పాటు కళాశాల అధ్యాపకులు ఉత్సాహంగా వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు సరస్వతి, హారిక, అధ్యాపకులు వీరేశం, సంతోష్, మల్లేశం, శ్రీనివాస్, శ్రీకాంత్, సతీష్, బోటనీ శ్రీకాంత్, సతీష్, గౌతం బుద్ధుడు, నర్సయ్య పాల్గొన్నారు.

లింగంపేట్: మండలంలోని పలు గ్రామాల్లో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.

మంగళ్‌పహాడ్‌లో బతుకమ్మ పండగ..

ఎడపల్లి: మండలంలోని మంగల్‌పహాడ్ గ్రామంలో బతుకమ్మ పండగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందుగా బతుకమ్మలు నిమజ్జనం చేసే చెరువు వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను గ్రామపంచాయతీ సర్పంచ్ బట్టుహనండ్లు, ఎంపీటీసీ సభ్యురాలు వనజ నాగరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి ఏర్పాట్లు చేయించారు. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు.



రెంజల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



తాడ్వాయి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



తాడ్వాయి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



లింగంపేట్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఎడపల్లి: మంగల్‌పాడ్‌లో బతుకమ్మ వేడుకలు..

బీఆర్ఎస్ పార్టీలో చేరిన సాటాపూర్ యువత



పార్టీలో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన సుమారు 30 మంది యువకులు సర్పంచ్‌ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు వికార్‌పాషా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలకు వారు ఆకర్షితులై పార్టీలో చేరారని ఆయన తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రాజు, వెంకటేష్, సోమయ్య, అరుణ్, నరేష్ ,శేఖర్, నాని, గణేష్, శివ, హనుమంతు, వెంకటేష్, శివ కుమార్, నాగరాజు, ఎం.హనుమంతు, శేఖర్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్కే అహ్మద్, లతా సాయిలు, పిట్ల భూమేష్, శ్రీకాంత్, ఇమ్రాన్, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో డిజిటల్ క్రాప్ సర్వే



డిజిటల్ క్రాఫ్ట్ సర్వే చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఆయా గ్రామాలలో ఖరీఫ్ సీజన్లో రైతన్నలు అత్యధికంగా వరి పంటలు వేశారు. ఇందులో భాగంగా రైతులు వేసిన వరి పంటల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్‌తో పాటు ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వరరావు తెలిపారు. ఎడపల్లి మండలం పైలట్ మండలం కింద ఎంపికైనందున డిజిటల్ క్రాఫ్ట్ సర్వేను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వారి వెంట ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారులు జ్యోతి, సప్తగిరి తదితరులు ఉన్నారు.

దుర్గామాత వెండి విగ్రహం వితరణ



వెండి విగ్రహాన్ని అందజేస్తున్న చైర్మన్ నర్సయ్య

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ఊరడమ్మ వీధిలోని శక్తి యూత్ దుర్గామాత మండపం వద్ద సిడిసి చైర్మన్ నర్సయ్య అమ్మవారి వెండి విగ్రహాన్ని గురువారం వితరణ చేశారు. అమెరికాలో ఉన్న నర్సయ్య కూతురు ఐరేని పూర్ణిమ కోరిక మేరకు 250 గ్రాములు (25 తులాల) వెండితో చేసిన దుర్గామాత అమ్మవారి విగ్రహాన్ని శక్తి యూత్ మండపం వారికి అమ్మవారి సన్నిధిలో అందించారు. కార్యక్రమంలో శక్తి యూత్ దుర్గామాత మండపం ప్రతినిధులు కోడిపాక ముత్యం గౌడ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఉద్యోగుల పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న అధికారుల బృందం

నవతెలంగాణ-మాచారెడ్డి

కేంద్ర సచివాలయంలో వివిధ శాఖలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా నూతనంగా నియమింపబడిన ఉద్యోగులు గురువారం పాల్వంచ మండలంలోని భవానిపేటలో పర్యటిచారు. వారు ఐదు రోజులపాటు ఆ గ్రామంలో పర్యటించనున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పంచాయతీ కార్యదర్శి పర్వీన్ బేగంను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాపను బతికించిన అంబులెన్స్ సిబ్బంది



నవతెలంగాణ-వర్ని

నిజామాబాద్ రూరల్ మండలంలోని దుబ్బ తండా గ్రామానికి చెందిన పూజ అనే గర్భిణీకి పుట్టిన బిడ్డ ప్రాణాలను అంబులెన్సు సిబ్బంది బతికించారు. దుబ్బ తాండకు చెందిన పూజ ఐదు నెలలకే పురిటినొప్పులతో బాధ పడుతుండగా విషయం తెలుసుకొన్న స్థానిక ఆశావర్కర్ పూజవద్దకు వచ్చి పరిస్థితి చూసి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్సు ఆలస్యం అవటంతో ఆ గర్భిణి ప్రసవమైంది. పుట్టిన బిడ్డ చలనం లేకపోగా కుటుంబీ కులు పాప చనిపోయిందేమో అనుకున్నారు. అంతలో అక్కడకు చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పాపను చూడగా పాప మెడ చుట్టూ అంబులికల్ కాడ్ ఉండటంతో సిబ్బంది వెంటనే అంబులెన్స్‌లో సీఆర్‌పీ చేశారు. దీనితో బిడ్డ ప్రాణం నిలిచింది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రత్యేక ఐసీయూలో ఉంచి వైద్యులు చికిత్సను అందజేశారు. ప్రస్తుతం పాప పరిస్థితి మెరుగు పడిందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలుపడంతో కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు. పాపను బతికించిన అంబులెన్స్ సిబ్బందికి ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు బైండోవర్

నవతెలంగాణ-రామారెడ్డి

గత ఎన్నికల్లో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 9 మందిని గురువారం స్థానిక తహసీల్దార్ రోజా ముందు ముందస్తు బైండోవర్లను చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

నిఘా కట్టుదిట్టం చేయాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- రాష్ట్ర సరిహద్దు సందర్శన

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో కట్టుదిట్టమైన నిఘాను ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆ ఏర్పాట్లల్లో భాగంగా గురువారం అడిషనల్ కలెక్టర్ మను చౌదరితో కలిసి తెలంగాణ రాష్ట్ర సరిహద్దు మహారాష్ట్ర బోర్డర్‌ను సందర్శించారు. అనంతరం మద్నూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ యంత్రాల స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ పట్ల అధికారులకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, ఇతర ఎన్నికల అధికారులు, బిచ్కుంద సీఐ కృష్ణ, మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న కలెక్టర్

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని పరామర్శించిన జెడ్పీటీసీలు



మంత్రిని పరామర్శిస్తున్న జెడ్పీటీసీలు

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన జెడ్పిటిసిలు, ప్రజాప్రతినిధులు గురువారం పరామర్శించారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి ఇటీవలే చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్వగ్రామం వేల్పూర్‌లో ఆమె తల్లికి సంతాపం తెలుపుతూ మంత్రిని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో లింగంపేట్ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, నాగిరెడ్డిపేట జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి, ఎల్లారెడ్డి జెడ్పిటిసి ఉష గౌడ్, రాజంపేట్ జెడ్పిటిసి కొండ హనుమాన్లు, గాంధారి జడ్పిటిసి శంకర్ నాయక్, లింగంపేట్ వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, మోతే సర్పంచ్ ఏలేటి రామ్‌రెడ్డి, లింగంపేట్ సింగిల్‌విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి తదితరులున్నారు.

దుర్గామాతకు పూజలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని యాచారం గ్రామంలో 4వ రోజు గురువారం జై భవానీ దీక్ష మండలి పూజ చేపట్టారు. కార్యక్రమంలో పంతులు రాహుల్, సర్పంచ్ భర్త రమేష్, ప్రిన్సిపాల్ అంబర్‌సింగ్, క్రాంతి, బానోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వీడీసీలపై పీడీ యాక్ట్ అమలు చేయాలి

- గీత కార్మిక సంఘ కార్యదర్శి రాష్ట్ర విటల్ గౌడ్



జెండాను ఆవిష్కరించిన గీత కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి విటల్ గౌడ్

నవతెలంగాణ-కోటగిరి

గీత కార్మికుల కుటుంబాలపైన గ్రామ అభివృద్ధి కమిటీలు దాడులను అరికట్టాలని, దాడులకు పాల్పడుతున్న వీడీసీలపై పీడీ యాక్ట్‌ను అమలు చేయాలని గీత కార్మిక సంఘ కార్యదర్శి రాష్ట్ర విటల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కోటగిరి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గీతా పనివార సంఘం ఆధ్వర్యంలో 65వ సంవత్సరాలు పూర్తి చేసుకొని 66వ సంవత్సరంలోకి వెళ్తున్న సందర్భంగా కోటగిరి బస్టాండ్ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర గీతా పనివార సంఘం జెండాను సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.విటల్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ విట్టల్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర గీతా పనివారాల సంఘం గీత కార్మికుల కుటుంబాల కోసం నిరంతరం పోరాటాలు చేసిన ఏకైక సంఘం అని తెలిపారు. కామ్రెడ్ ధర్మ బిక్షం నాయకత్వాన 1957లో సంఘాన్ని స్థాపించి గీత కార్మికుల హక్కుల కోసమై నిరంతరం పోరాటాలు చేసి కార్మికులకు చైతన్యపరిచి ఉద్యమల ద్వారా తన హక్కులు సాధించుకోవాలని చెప్పిన మహనీయుడు కామ్రేడ్ ధర్మ బిక్షం అని వివరించారు. ప్రస్తుతం గీతా కార్మికుల కుటుంబాల పైన నిజామాబాద్ జిల్లాలో గ్రామ అభివృద్ధి కమిటీల పేరుమీద గీత వృత్తి కార్మికులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గీత వృత్తిపైన కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులకు గ్రామ అభివృద్ధి పేరు మీద డబ్బులు డిమాండ్ చేస్తూ గీత కార్మికులకు వేధిస్తున్నారని అన్నారు. ఇప్పటికే గ్రామాలలో చీఫ్ లిక్కర్ వలన కల్లు అమ్మకాలు లేక గీత కార్మికుల కుటుంబాలు వలస వెళ్తున్నారని పెరుగుతున్న మార్కెట్లలో ధరలకు అనుకూలంగా కల్లు అమ్మకాలు జరుపుతున్నామని కానీ వీసీడీ ఈ మాటలను పట్టించుకోకుండా గీతా కార్మికుల కుటుంబాలకు ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో గీతా పని వారి సంఘం నాయకులు బి.వెంకట్ గౌడ్, సురేష్ గౌడ్, పండరి గౌడ్, నరేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై ఉదయ్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన మస్కూరి సాయిలు గత కొన్ని రోజుల కిందట సాటాపూర్ సంతలో సెల్‌ఫోన్ పోగొట్టుకోగా ఆ సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిసిటిఎన్ఎల్ కానిస్టేబుల్ గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవి మండపాలను దర్శించుకున్న మేడపాటి



పూజలు చేస్తున్న మేడపాటి ప్రకాశ్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి బోధన్, సాలూర మండలాల్లోని దుర్గాదేవి మండపాలను గురువారం సందర్శించారు. బోధన్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు, దోబీగల్లీ, తట్టికోట్, బోధన్ మండలంలోని కల్దుర్కి, సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో ఆయన దేవిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

మాక్లూర్‌లో ఘనంగా బతుకమ్మ పండుగ


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో మహిళలు బతుకమ్మ పండుగను గ్రామ కమిటీ అధ్వర్యంలో ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బతుకమ్మను తీసి గ్రామంలోని ప్రధాన విదుల గుండా బతుకమ్మ అడుతూ శోభాయాత్ర నిర్వహిస్తూ గ్రామంలోని చింతల చెరువులో బతుకమ్మను నిమజనం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అశోక్ కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ రమణారావు, ఎంపిటిసి వేకటేశ్వర్ రావు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

హైవే వద్ద ముమ్మరంగా తనిఖీలు


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్, నిజామాబాద్ ఎంపీడీవో మల్లేష్ గురువారం తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను తహసీల్దార్ కలీం గురువారం సాయంత్రం అందజేశారు. మండలంలోని అర్గుల్, లక్ష్మాపూర్, మునిపల్లి, పుప్పాలపల్లి తదితర గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బాల్కొండ విద్యుత్ శాఖ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోనీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

నేటి రాహుల్ సభను విజయవంతం చేయండి

- కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి


ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు రాహుల్ గాంధీ పర్యటన కాంగ్రెస్ శ్రేణుల కార్నర్ సమావేశం విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ రెడ్డి అన్నారు. మండలంలోని చేపూర్ గ్రామంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్యారంటీ కార్డు పథకాలు అమలు చేస్తామని అవినీతి రహిత ఆర్మూర్‌గా తీర్చి దిద్దడానికి తాను ముందు ఉంటానని అన్నారు. గడప గడపకు కాంగ్రెస్ పథకాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఒకసారి తనకు అవకాశం ఇవ్వాలని అన్నారు. భారీ మెజారిటీతో తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకుల స్క్రిప్టు తప్ప రాహుల్ గాంధీకి ఏమి తెలియదు

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-ఆర్మూర్

రాహుల్ గాంధీకి రాష్ట్ర నాయకులు ఇచ్చిన స్క్రిప్ట తప్ప.. ఇంకేమీ తెలియదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాక్యాలు చేశారు. మండలంలోని అంకాపూర్‌లో ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గెలిచిన కర్ణాటక రాష్ట్రంలో పథకాలు అమలు కావడం లేదని, రాహుల్ ఏ రాష్ట్రానికి వెళ్లిన ఆ రాష్ట్రంలోని స్థానికంగా ఉన్న సమస్యలపై అవగాహన లేదని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 24 గంటల విద్యుత్ ఉండదని వెల్లడించారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుల అంచనా వ్యయం లక్ష కోట్లు అయితే అవినీతి లక్ష కోట్లు జరిగిందని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అయితే రాహుల్ గాంధీ వారు చేస్తున్న పాలన ఏమిటని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు పూజ నరేందర్, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, వైస్ చైర్మన్ షేక్ మున్న, మల్యాల నర్సారెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జెండావిష్కరణ



జెండావిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జండా ఆవిష్కరణ గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం 66వ వార్షికోత్సవ సందర్భంగా జిల్లా కార్యాలయం వద్ద జండా ఆవిష్కరణను పెద్ది వెంకట్రాములు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు 1944లో నాటి బ్రిటిష్ పాలకుల నిర్బంధాన్ని తట్టుకోలేక బాధలు పడుతున్న గీత కార్మికుల పక్షాన నిలబడి, దాట్ల సూర్యనారాయణ రాజు సంఘాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం విశాలాంధ్ర ఏర్పడ్డాక 1957లో మొదటి మహాసభ ఖమ్మం జిల్లా గార్ల మండలంలో ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘంగా అక్టోబర్ 19న ఏర్పడిందని తెలిపారు. నాటి గీత వృత్తి రక్షణ, గీత కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసి, అనేక చట్టాలు, జీవోలు, పాలసీలను తెచ్చుకుందని అన్నారు. ప్రతి సొసైటీకి, టిఎఫ్‌టి షాపునకు 560 జీవో ప్రకారం ఐదు ఎకరాల భూమిని చెట్లు పెంచుకోవడానికి ఇవ్వాలనే జీవోను సాధించుకుందని తెలిపారు. పార్టీలు మేనిఫెస్టోల్లో తమ డిమాండ్స్ పెట్టాలని కోరారు. ఎవరైతే మేనిఫెస్టోలో తమ డిమాండ్స్ పెడతారో వారికే గౌడ-గీత కార్మికుల మద్దతు ఉంటుందని తెలిపారు. ఈనెల 20న హైదరాబాద్ సుందరయ్య కళామందిర్‌లో సభ జరుగుతుందని అన్నారు. దానికి నిజామాబాద్ జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో గౌడ-గీత కార్మికులు పాల్గొనాలని కోరారు.

పోలింగ్ విధులపై అవగాహన అవసరం

- ప్రిసైడింగ్ అధికారుల శిక్షణలో కలెక్టర్
- ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం కల్పించకూడదని హితవు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎన్నికల ప్రక్రియలో అతి కీలకమైన పోలింగ్ విధుల పట్ల సంబంధిత అధికారులు, సిబ్బంది పరిపూర్ణమైన అవగాహనను ఏర్పర్చుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గురువారం ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏ చిన్న తప్పిదానికి సైతం ఆస్కారం కల్పించకూడదని, నిబంధనలు తూచ తప్పకుండా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని హితవు పలికారు. ముఖ్యంగా మాక్ పోల్ జరిపిన తరువాత తప్పనిసరిగా డాటాను డిలీట్ చేయాలని, ఈ విషయాన్ని ప్రతి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి గుర్తుంచుకోవాలని అన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్ డేటా జీరో ఉందా లేదా అన్నది తప్పక పరిశీలించుకోవాలని తెలిపారు. అదేవిధంగా పోలింగ్ ముగిసిన మీదట ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయి అనే వివరాలను జాగ్రత్తగా సరిపోల్చుకోవాలని సూచించారు. 17 -ఎ, 17 -సి వివరాలతో కంట్రోల్ యూనిట్ వివరాలు సరిగ్గా సరిపోవాలని తెలిపారు. కాగా, పోలింగ్ సందర్భంగా ఓటింగ్ యంత్రాలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని అన్నారు. మాక్ పోల్ సమయంలో సాంకేతిక ఇబ్బంది ఏర్పడినప్పుడు సంబంధిత యంత్రాన్ని మాత్రమే మార్చాలని, పోలింగ్ సమయంలో మాత్రం కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లలో ఏ ఒక్క దానిలోనూ సమస్య తలెత్తినా సి.యు, బీ.యు లను మార్చాలని సూచించారు. పోలింగ్ సజావుగా నిర్వహిస్తే, కౌంటింగ్ సాఫీగా జరిగి ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తవుతుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పోలింగ్ విధులను ఎంతో జాగరుకతతో నిర్వహించాలని, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ పర్యవేక్షణ జరపాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు సంజీవ్, గోపాలకృష్ణ, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

సాధ్యంకాని మ్యానిఫెస్టోల పట్ల అప్రమత్తంగా ఉండండి

- వాటి అమలుకు నిధులెలా సేకరిస్తారో నిలదీయండి
- టీపీజేఏసి సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నేడు ఆకర్షణీయమైన హామీలతో ప్రజల ముందుకు వస్తున్న వివిధ రాజకీయ పార్టీల హామీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటి అమలుకు నిధులను ఎలా సమకూర్చుకుంటాయో తెలియజేయడం లేదని, కావున ఆచరణ సాధ్యంకాని ఎజండాలతో వచ్చే అభ్యర్థులను ప్రజలు ప్రశ్నించాలని టీపీజేఏసీ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు.

పదేళ్లగా కేంద్రంలో, రాష్ట్రంలో అప్పుల భారాన్ని ప్రజలపై మోపి అధికారాన్ని చలాయిస్తున్న పార్టీలు ఇష్టం వచ్చిన రీతిలో పన్నులు వేస్తూ, ధరలను అరికట్టడంలో విఫలమై ప్రజలమధ్య కుల మతాల చిచ్చు పెడుతూ తమ పబ్బం గడుపుకుంటున్నాయని అన్నారు. వీరి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తాయిలాలకు లోబడక చైతన్య వంతంగా ప్రజలు వ్యవహరించాలని తెలిపారు.

ప్రజలు ఎదుర్కొంటున్న అధిక ధరలు, నిరుద్యోగం, పరీక్షలు- పేపర్ లీకేజీ, విద్యార్థుల, నిరుద్యోగుల ఆత్మహత్యలు, అవినీతి, కల్తీ విత్తనాలు, కల్తీ పురుగు మందులు, పంటలకు మద్దతు ధర, అడ్డగోలు కరెంటు చార్జీలు,పెరుగుతున్న బస్సు చార్జీలు మొదలగు సమస్యలపై నిలదీయాలని అన్నారు. ఎన్నికల సమయంలో మద్యం ఏరులై పారుతున్నదని, ప్రజలను మత్తులో ముంచి, ఆలోచించలేని స్థితిలో ఓట్లు వేయించుకునే పరిస్థితి ఉన్నందున ఎన్నికల కోడ్ వచ్చినప్పటినుండి ఫలితాలు వెలువడేవరకు మద్యం దుకాణాలు మూసి ఉంచేలా ఎన్నికల నిబంధనలు మార్చాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ పీపుల్స్ జెఎసి కన్వీనర్ డా. రవీంద్రనాథ్ సూరి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం లో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, పెన్షనర్స్ సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు భాస్కర్, రాంమోహన్‌రావు, శ్రీనివాస్ రాజు, రామచందర్ గైక్వాడ్, దత్త్రాతి రావు, వీరయ్య, పుల్లం మోహన్, బోడ అనిల్, మదన్ మోహన్, జహీరుద్దీన్, షేక్ హుస్సేన్, బాబా గౌడ్, ప్రసాద్, అందె సాయిలు, బోధన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాల పండగ బతుకమ్మ

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


బతుకమ్మను పేరుస్తున్న ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-ఆర్మూర్

మన సంస్కృతి సాంప్రదాయాల పండగ బతుకమ్మ అని భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కవిత, ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి సతీమణి రజిత రెడ్డి హాజరై స్థానిక మహిళలతో కలిసి తీరక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ వేడుకను అధికార పండుగగా గుర్తించిందని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు అత్యంత ఇష్టమైన పండుగ బతుకమ్మ అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫైడ్ చైర్మన్ మార గంగారెడ్డి, వైద్యులు డాక్టర్ మధుశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, వైస్ చైర్మన్ షేక్ మున్న, పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, బి ఆర్ ఎస్ నాయకులు జనార్ధన్ గౌడ్ ,మల్యాల నర్సారెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప సన్నాహక సదస్సును విజయవంతం చేయండి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మాదిగల విశ్వరూప సన్నాహక సదస్సును విజయవంతం చేయండి అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ నాయకురాలు పెద్దోళ్ల యమున పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జిల్లా సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సదస్సుకు వ్యవస్థపాక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా విచేయా నున్నట్లు ఆమె చెప్పారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కేంద్రం లోని శ్రద్ధానంద్ గుంజిలో గురువారం కరపత్రాలు ఆమె ఆవిష్కరించ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదిగ మాదిగ ఉపాకులాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే వర్గీకరణే వెన్నెముక లాంటిదన్నారు. మహిళా శక్తి మహాగొప్పదని మహిళలు తలుచుకుంటే సాధించలేనిది లేదని అన్నారు. సదస్సులో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళనాయకురా ళ్లు కల్హారి సుధా. కల్యాణి. శంకరవ్వ. బుడేవ్వా. భాగ్య. ప్రేమలత. సాయిలు. రాంచందర్ పాల్గొన్నారు.

విశ్వరూప బహిరంగ సభ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

నవంబర్ 7న నిర్వహించనున్న మాదిగల విశ్వరూప బహిరంగ సభ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తడగాం కాలనీలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకారం రమేష్ మాట్లాడుతూ.. నవంబర్ 7న జరిగే మాదిగల విశ్వరూప బహిరంగ సభను విజయవంతం చేయడంతో పాటు బహిరంగ సభ సన్నాహకంగా ఈనెల 22న నిజామాబాద్ జిల్లా సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతారని, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గుర్రాల మోహన్, సంజీవ్, లింగం, కృష్ణ, సురేష్, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసుకున్న వివాహిత మృతి



నవతెలంగాణ- నవీపేట్

పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ (ఏ) గ్రామంలో దోనపల్లి విజయ (42) బుధవారం ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై యాదిగిరి గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ రూరల్ మల్కాపూర్(ఏ) గ్రామానికి చెందిన దోనపల్లి విజయ కులానికి చెందిన చంద్రయ్య మృతురాలి యారలుతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తన ఇంటికి రావద్దని ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో మనస్థాపం చెంది ఇంట్లో దూలానికి ఉరి వేసుకుంది. గమనించిన కుంటుంబీకులు ఆస్పత్రికి తరలించిన పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి సోదరుడు నర్సయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూరల్ కాంగ్రెస్ టిక్కెట్ దక్కేదెవరికో?

- నలుగురు పోటీపడే అవకాశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత కొన్ని నెలల క్రితం కర్ణాటక రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపిని కాదని కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడంతో పొరుగునే ఉన్న తెలంగాణ రాష్ట్రంపై కాంగ్రెస్ పార్టీలో వచ్చి పడింది. ఇదే కాకుండా అసలు నిజామాబాద్ రూరల్‌లో ఏం జరుగుతుందనే చర్చ ప్రతి ఒక్కరిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని నాగేశ్‌రెడ్డి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి గ్రామ గ్రామాన తెలంగాణ వాని వినిపించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీగా డాక్టర్ భూపతిరెడ్డిని టీఆర్ఎస్ ప్రభుత్వం నియమించింది.

చివరకు ఇంక మూడేళ్ల పదవి కాలం ఉండగానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి గత ఎన్నికల ముందు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు 2019లో జరిగిన ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ భూపతిరెడ్డికి టికెట్ కేటాయించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఆనాటి నుండి గ్రామ గ్రామాల్లో ప్రచారం నిర్వహించుకుంటూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశారని వాదనలు ఉ

న్నాయి. గత కొన్ని నెలల క్రితం మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అరికెల నర్సారెడ్డి సైతం టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం నిజామాబాద్ రూరర్‌లో నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటిపల్లి నాగేష్ రెడ్డి, ఇద్దరు మాజీ ఎమ్మెల్సీలు డాక్టర్ భూపతి రెడ్డి, అరికెల నర్సారెడ్డిలు ఈసారి జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు. ముగ్గురు కలిసి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో గడపగడపకు అనే కార్యక్రమంతో విస్తృతంగా పర్యటించి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోజురోజుకు మారుతున్న రాజకీయ పరిణామాలలో భాగంగా కొన్ని రోజులుగా ప్రచారం నిర్వహించుకున్న ఈ ముగ్గురు ప్రస్తుతం ఆశల పల్లకిలో ఊగుతూనే తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టకపోవడం తో అసలు కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందోనని ప్రజలు చర్చించుకుంటు న్నారు. ఇంకోవైపు మొదటి విడతలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన నియోజకవర్గాలకు ప్రకటించలేదు. ఈ ముగ్గురిలో ప్రతి ఒక్కరు తమ పలుకుబడిని ఉపయోగించు కుంటూ ఢిల్లీలో తమకు సన్నిహితంగా ఉన్నవారితో టికెట్ రేసులో ఉన్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. సీనియర్ నాయకుడు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉన్నత పదవులు అధిరోహించిన వెంకటేశ్వరరావును పార్టీలో చేర్పించుకోవడానికి 2019 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆరే స్వయంగా ఆయన ఇంటికి వెళ్లిన విషయం తెలిసిందే. ఆనాటి నుండి ఐదేండ్లపాటు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూనే సమయం వచ్చినప్పుడల్లా విమర్శనాస్త్రాలను సంధించారు. గత కొన్ని రోజుల క్రితం టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి కూడా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈనెల 20న కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ జిల్లా పర్యటనలో భాగంగా మండవ వెంకటేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరుతారనే ఊహాగానాలు వినిపిసు న్నాయి. ఇదే గనక నిజమైతే మండవకు టికెట్ అందజేయవలసి వస్తే నిజామాబాద్ రూరల్‌లోని ఏకైక స్థానం కేటాయించక తప్పని పరిస్థితి కాంగ్రెస్‌లో నెలకొంది. ఏళ్లపాటు పార్టీని నమ్ముకొని పనిచేసిన అసలు సమయానికి అభ్యర్థిగా అవకాశం వస్తుందో రాదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టికెట్ వచ్చిన తర్వాత ప్రచారం నిర్వహించుకుంటే బాగుంటుందని అభ్యర్థులు స్తబ్దుగా ఉన్నట్లు సమాచారం. మాజీ మంత్రి మండవతో కలిసి నలుగురు పోటీపడే అవకాశం ఉందని, దీనిలో ఏ ఒక్కరికి వచ్చిన మిగిలిన ముగ్గురు ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందజేసుకుంటారో లేదో అని అనుమానాలు మాత్రం లేకపోలేదు. అధిష్టానం కూడా నలుగురిలో ఏ ఒక్కరిని ప్రకటిస్తే ప్రతి గ్రామం గిరిజన గూడాలలో ప్రచారం నిర్వహించుకోవచ్చుని అనుకుంటున్నట్లు సమాచారం. సమయం లేనప్పుడు ఇస్తే పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకొని వెళ్లలేక పోతామని పలువురు నాయకులు నవ తెలంగాణ దృష్టికి తీసుకుని వచ్చారు ఏది ఏమైనా అభ్యర్థులను ప్రకటించి గ్రామాల్లో విస్తృతమైన ప్రచారం నిర్వహించే వెసులుబాటు కల్పించే విధంగా అధిష్టానం చర్యలు చేపట్టాలని నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.